మైనపంట నువ్వులు. ముఖ్యమైన పరిశ్రమ తైలంతియ్యటం ముఖ్యమైన వ్యాపారం కట్టెలు. వ్యాసుడినాటికింకా రాతుసిబొగ్గూ హైడ్రోజన్ స్టీమూ లేవు. ఎలెక్ట్రిసిటీ బొత్తిగా తెలియదు.

యమధర్మరాజు శిక్షలివ్వటంలో విధి. 'పదివేల అర్బుదాలు కుంభీపాకం,' 'పన్నెండు వేల అర్బుదాలు రౌరవం,' 'ఇరవైతొమ్మిది వేల అర్బుదాలు పుం.' (ఈ పుం అనేనరకం ప్రత్యేకంగా ఆర్యఋషులు ఏర్పాటుచేయించినటువంటిది. ఆరోజుల్లో ఆర్యులసంఖ్య భూమిమీద క్షీణించసాగింది. అందుకని పిల్లలు లేని ఆర్యులకు బుద్ధివచ్చేటందుకు ఆనరకం ఏర్పాటుచేశారు. ఆర్యులేం వెర్రివాళ్లా? తమకు పిల్లలు పుట్టకపోతే మరొకరకంగా పిల్లలను పుట్టించుకుని, ఎనిమిదిరకాల పుత్రులను లీగలైజుచేసి పుం నరకాన్నుంచి తప్పించుకున్నారు. ఇందువల్లనే ఆర్యరక్తం ఏకోశానాలేని మనమంతా బ్రాహ్మలమని చెప్పుకుంటూ ఒకరికొకరం 'ఆర్య' అని ఉత్తరాలు రాసుకుంటున్నాం.)

రానురాను యమధర్మరాజు ప్రకృతి అతి విచిత్రంగా మారిపోయింది. మొదట్లో మనుష్యులను శిక్షించటం తనకు ఇష్టంలేనట్టూ కేవలమూ న్యాయబుద్ధిచేత తప్పని సరిగా శిక్షలు విధిస్తూ ఉండినట్టూ నటించేవాడు. కాని కాలక్రమాన ఇదిపోయింది. ఏరోజున శిక్ష విధించేటందుకు జనంలేకపోతే ఆరోజు అతనికి దుర్దినంగా ఉంటూవచ్చేది. భూమిమీద పుణ్యం జాస్తిఅయి నరకకూపాలకు పంపేటందుకు మనుష్యులు లేకపోతే ఈ యమధర్మరాజు ఇతర దిక్పాలకులతో మొరపెట్టుకుని ఏవిష్ణుమూర్తిదగ్గిరికో వెళ్ళి భూమిమీద పుణ్యంతగ్గేమార్గ ఏర్పాటు చేయించుకునేవాడు. *

ఇందుకు కేవలమూ యమధర్మరాజునే మనం దూషించనక్కర్లేదు. ఎందుచేతనంటే ఆర్మమెంటు మాగ్నేట్స్‌కొన్ని మిలియనుల పౌనులకు ఆయుధాలుచేసి కూర్చుని యుద్ధమంత్రిగారిని ప్రేరేపించి యుద్ధంచేయించినట్టే, నరకంలో నూనెకూ కట్టెలకూ లాభకరమైన టెండర్లమీద కంట్రాక్టు తీసుకున్న మహానీయులు అనూనె కట్టెలయొక్క వాడకం సరిగా జరగనిపక్షాన యమధర్మరాజును బతకనిచ్చేవాళ్లు కారు.

అంతే! అంతవరకు మనం ఊహించగలుగుతున్నాం పురాణాదులనుబట్టి. మొన్నమొన్న మన స్విరిచు అలిస్టు పోయి చూతురుగదా యమలోకం పూర్తిగా మారిఉంది. ఎక్కడా నరకకూపాలు లేవు. యమధర్మరాజు లేడు. నువ్వులపొలాలు లేవు. కట్టెల అడితలు లేవు. మట్టి లాగులవాళ్లు లేరు. చిత్రగుప్తుడు లేడు. హిందూమత పక్షపాతమూ బ్రాహ్మణపక్షపాతమూ లేవు. శిక్షలు లేవు. యమధర్మరాజు స్థానే ఒక దివ్యపురుషుడు నిశ్శబ్దంగా పనిచేస్తున్నాడు. యమలోకం యావత్తూ సుఖమయంగా ఉంది. పాపాలుచేసినవాళ్లు రోగులమాదిరిగా తమకుతామై అక్కడి వైద్యులదగ్గిరికిపోయి చికిత్సచేయించుకుంటారు. నరకకూపాలస్థానే అక్కడ ఆసుపత్రులు వెలిసినై. ఇక్కడి వైద్యులు విశ్వప్రయత్నాలుచేసి కనిపెట్టలేకుండా ఉన్న రహస్యం అక్కడివైద్యులు కనిపెట్టారు— ప్రతి పాపమూ ఒక విధమైన రుగ్మతేనని! అంతే కాదు ఈపాపాలకి చికిత్సకూడా కనిపెట్టారు.



* ఇది నమ్మలేనివాళ్లు నేషనల్ మూవీటోనువారి 'రుక్మాంగద' చూతురుగాక! (ఆం.సం.)

ఈ నాలుగైదువేల సంవత్సరాలలో ఇంత మార్పు! ఈమార్పు నమ్మటానికి వీలులేనిదిగా కనిపిస్తుంది చప్పున చూడటానికి కాని జాగ్రతగా పరిశీలిస్తే ఈమార్పును సూచించినవారు ఈమధ్యకాలపు కవులలో ఒకరిద్దరు లేకపోలేదు. ఇటలీలో దాంతె అని ఒక పొలిటీషియన్ ఉండేవాడు. ఈయన ప్రతిపక్షులు ఈయన్ను కనపడినచోట నిలువునా కాల్చివేయవలసిందిగా ఒక శాసనం చేశారు. (అప్పుడు వాళ్ళదీ మెజారిటీ.) అందుమీదట ఈదాంతె కోపంవచ్చి 'డివైనా కామెడియా' అని ఒక గ్రంథంరాశాడు. ఆ గ్రంథంలో తనకిష్టంలేనివారి నందరినీ నరకకూపాల్లో తోశ్కాడు. ఆగ్రంథం రాయటానికని ఈ దాంతె బొందితో నరకానికి వెళ్ళి వచ్చాడని ప్రతీతి. ఆయన్ను వార్ధక్యంలో చూసినవాళ్లు 'అడుగో నరకానికి వెళ్ళివచ్చినవాడు!' అని చెప్పుకుంటూ దూరంగా తొలిగి పొయ్యేవాళ్లుట. ఇంతకూ ఈ దాంతె తన పుస్తకంలో 'పర్గేటరీ' అనే ఒకవిధమైన ఆసుపత్రి ఒకటి నరకంలో ఉన్నట్టు రాస్తున్నాడు.

మిల్టన్ అనే మరొక ఇంగ్లీషుకవి 'పారడైజ్ లాస్ట్' అనే మరొక గ్రంథంరాశాడు. ఈయనకూడా నరకకూపాలను వర్ణించాడు. ఈయనకూడా నరకాన్ని స్వయంగా చూచి వచ్చినట్టు కనపడుతుంది. కాని ఈయన వర్ణనలు మనం సంపూర్ణంగా విశ్వసించటానికి లేదు. ఏమంటే ఈయన గుడ్డివాడు. (అందుకనే 'కాంతిలేని జ్వాలలు' అంటాడు. ఆయనకు వేడి తెలుస్తుందికాని కాంతి కనిపించదు.) ఇంతకూ ఈమిల్టన్ తన గ్రంథంలో నరకంలో ఒక విప్లవం జరిగిందని స్పష్టంగా సూచించుతున్నాడు. ఆసమయానికి అక్కడ సోషలిజం వచ్చిఉండిం దనుకోవచ్చును.

మన సమకాలికుడు జార్జి బెర్నార్డుషా 'మాన్ అండ్ సూపర్‌మాన్' అనే నాటకంలో నరకం చాలా సుఖప్రదమైనచోటని చెబుతున్నాడు. దీనికేమీ సందేహంలేదు. నరకానికి అధిపతిగా భావించబడే మెఫిస్టోఫిలిస్ అనే పెద్దమనిషియొక్క మారుడు మూర్తులూ అయిన పానరకాన్నిగురించి తెలిసే చెబుతున్నా డనుకోవాలి.

నరకంలోకూడా భూలోకపు రాజకీయాలు తప్పవా అని అనుకోవద్దు. స్వర్గానికి వెళ్ళినా తప్పని విడాకులు నరకంలో ఏంతప్పుతవి గనక ?

# నేను

ఈసభాభవనాన నేనెపుడో కాని,
పాడినట్టులె నాకు జ్ఞాపకముకలదు—
ఈ సభాసింహపీఠి నన్నే వరించి,
యెప్పుడో బానిసేని గావించుకొనియె—

* * *

ఈ సుధానిధి నడచు మధ్యేపథాన
మబ్బుతునుక లక్ష్యప్పుడు మరుగుపఱచు—
తలగిపోవును పరిణామదశలలోన
ప్రాపులోపింప భ్రష్టమర్యాదతోడ—

* * *

గాయకుడ నేను : నవ్యరాగములనిచట
నాలపింతును, లోకమునాలకింతు—
సత్కవిని నేను : కవితాప్రసారమిచట
జిలుకరింతును, లోకము దొలుకరింతు—

—ప్రయాగ కోదండరామ.
(యువభారతీసభ.)